ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No: APTEL/2023/87888
గురువారం
30 అక్టోబర్ 2025

ఆర్జేడీ-కాంగ్రెస్ @ 5-కే సర్కార్: మోదీ విమర్శలు

ముజఫ్ఫర్‌పుర్, అక్టోబర్ 30, (రిపబ్లిక్ న్యూస్): బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతోన్న వేళ ప్రచార వేడి పెరుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం ముజఫ్ఫర్పుర్లోని ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్జేడీ-కాంగ్రెస్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీలు ఎక్కడుంటే అక్కడ జంగిల్ రాజ్ వస్తుందని మోదీ దుయ్యబట్టారు."ఆర్జేడీ-కాంగ్రెస్ పాలనను ఐదు పదాల్లో చెప్పాచ్చు. కట్టా (నాటు తుపాకీ), క్రూరతా (క్రూరత్వం), కటుత (దురుద్దేశం), కుశాసన (సుపరిపాలన లేకపోవడం), కరప్షన్ (అవినీతి).. ఇవే ఆ పార్టీల పాలనా విధానాలు. ఆయుధం ఉన్నచోట క్రూరత్వం ఉంటుంది. ఆటవిక రాజ్యం వస్తుంది. ఆర్జేడీ అధికారంలో ఉన్న సమయంలో షోరూంలో నుంచి వాహనాలను దోచుకెళ్లారు. వారి హయాంలో బిహార్ లో 35 వేల నుంచి 40వేల వరకు కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి" అని మోదీ మండిపడ్డారు.

వారిది నూనె-నీటి బంధం

ఇక, మహాగర్ బంధన్ లో విభేదాల గురించి ప్రస్తావిస్తూ మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. "ఆర్జేడీ-కాంగ్రెస్ పార్టీలది నూనె-నీటి లాంటి బంధం. ఆ రెండూ ఎప్పటికీ కలవవు. బిహార్ వారు కలిసి చేస్తున్న ర్యాలీలన్నీ ఓట్ల కోసం చేస్తున్న బూటకపు చర్యలే" అని ప్రధాని ఎద్దేవా చేశారు. తనను విమర్శించడం అంటే.. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తమ జన్మహక్కులా భావిస్తున్నారని అన్నారు.

ఛఠ్ పూజను డ్రామా అన్నారు..

ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన ఛఠ్ పూజను కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీలు అవమానించాయని మోదీ విమర్శించారు. ఓట్ల కోసం వారు ఎంతకైనా దిగజారుతారని మండిపడ్డారు. ఇలాంటి అవమానాన్ని బిహార్ తల్లులు ఎన్నటికీ మర్చిపోరని, అలాంటి వారిని క్షమించబోరని అన్నారు. ఇక, ఛఠ్ పూజకు యునెస్కో గుర్తింపు దక్కేలా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మోదీ ఈ సందర్భంగా తెలిపారు.

ముందస్తు చర్యలతో నష్టాన్ని చాలా వరకు తగ్గించాం: డిప్యూటీ సీఎం పవన్

కోడూరు, అక్టోబర్ 30, (రిపబ్లిక్ న్యూస్): మొంథా తుపానుతో కలిగే నష్టాన్ని ముందస్తు చర్యలతో చాలా వరకు తగ్గించామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సీఎం చంద్రబాబు ముందుచూపుతో చాలా జాగ్రత్తలు తీసుకున్నారని చెప్పారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ మెసేజ్ లు పంపామన్నారు.

కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు మండలంలో దెబ్బతిన్న పంటలను పవన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "46 వేల హెక్టార్లలో వరి, 14వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ప్రతి జిల్లా కలెక్టర్, ప్రభుత్వ యంత్రాంగం బాగా పనిచేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఉచితం బియ్యం అందిస్తున్నాం. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాం. ఇళ్లకు వెళ్లే సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.3వేలు ఇస్తున్నాం. డ్రైన్ల పూడిక తీతల ద్వారా నీరు నిల్వ లేకుండా చేశాం. అక్వా రైతుల ఇబ్బందులు నా దృష్టికి వచ్చాయి. సీఎంతో మాట్లాడిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో బాగా నష్టం జరిగింది. గ్రామాల్లో పాడైన రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేస్తాం" అని పవన్కల్యాణ్ తెలిపారు.

తుపాను బాధితులను ఆదుకుంటాం..
కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబర్ 30, (రిపబ్లిక్ న్యూస్): మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. దెబ్బతిన్న పంటలు, రహదారులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే వరదసాయం అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళి వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల ఇన్చార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. దానికి అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు.

కృష్ణా, ఉపనదులకు వరద..
అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి: మంత్రి నిమ్మల

విజయవాడ, అక్టోబర్ 30, (రిపబ్లిక్ న్యూస్): ఎగువన కురిసిన భారీ వర్షాలకు కృష్ణా, ఉపనదులకు భారీ వరద వస్తోందని.. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరదను ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈరోజు సాయంత్రం ప్రకాశం బ్యారేజికి 6 నుండి 6.5 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ఈక్రమంలో దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణా డెల్టా పరిధిలో అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ.. మందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వాగులు పొంగుతుండటంతో ఆయా జిల్లాల కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుండ్లకమ్మ నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అధిక వర్షాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు వాగులు, కాలువ గట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

రిటైర్మెంట్ తీసుకోను..
చివరి శ్వాస వరకూ సెట్లోనే..: రవితేజ

'మాస్ జాతర అంటూ ఆడియన్స్ ను అలరించడానికి సిద్ధమయ్యారు హీరో రవితేజ. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో రవితేజ ప్రచారం జోరు పెంచారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు."ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. దీని చిత్రీకరణలో నాకు కొన్ని గాయాలు అయ్యాయి. వాటి కారణంగానే చాలాసార్లు వాయిదా పడింది. సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నాం, తర్వాత వేసవిలో రావాలనుకున్నాం, వినాయక చవితికి రిలీజ్ చేద్దాం అనుకున్నాం.. ఆ తేదీలేవీ కుదర్లేదు. ఇన్ని రోజులకు విడుదల చేస్తున్నాం. ఇదే సరైన సమయమని అనుకుంటున్నా. ఏది జరిగినా మన మంచికే. నా కెరీర్లో సినిమా ప్రారంభించిన తర్వాత ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు. మొదటిసారి ఇలా జరిగింది.."జయాపజయాలను నేను పట్టించుకోను. నా పని చేస్తూ వెళ్తాను. ఎవరికైనా నేను ఇచ్చే సలహా ఇదే. మన పనిని వందశాతం కష్టపడి చేస్తూ వెళ్తే ఏదో ఒకరోజు దానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతాను. ఆత్మవిశ్వాసం తగ్గిపోతే ఏదీ సాధించలేరు. అన్నిటికంటే మనపై మనకు నమ్మకం ముఖ్యం. నటనకు రిటైర్మెంట్ తీసుకోను. నా చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటాను. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. అందుకే అవి నన్ను ప్రభావితం చేయవు" అని రవితేజ తెలిపారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

18వ నంబర్ జెర్సీ ధరించిన రిషభ్ పంత్..
నెట్టింట వైరల్!

గాయం నుంచి కోలుకొని దక్షిణాఫ్రికా ఏతో రిషభ్ పంత్ అనధికారిక టెస్టు సిరీస్ బరిలోకి దిగాడు. ఇంగ్లాండ్ తో జరిగిన టెస్టు సిరీస్ సమయంలో పాదానికి గాయం కావడంతో రిషబ్ పంత్ దాదాపు మూడు నెలల పాటు ఆటకు దూరంగా ఉన్నాడు. ఇప్పుడు భారత్ ఏ జట్టు సారథిగా మ్యాచ్ ఆడుతున్నాడు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ మైదానం వేదికగా తొలి మ్యాచ్ మొదలైంది. టాస్ నెగ్గిన రిషబ్ పంత్ బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే, ఇక్కడే అతడు ధరించిన జెర్సీ ఫొటోలు వైరల్ గా మారాయి. రిషభ్ పంత్ 18వ నంబర్ తో కూడిన జెర్సీని ధరించి మైదానంలోకి వచ్చాడు. దీంతో అందరి దృష్టి ఆ జెర్సీ పైనే పడింది. ఎందుకంటే, అది ఒకప్పుడు స్టార్ ఆటగాడు, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి జెర్సీ నంబర్ కావడమే విశేషం. విరాట్ టెస్టులకు రిటైర్మెంట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఆ జెర్సీని పంత్ ధరించాడు. సాధారణంగా పంత్ జెర్సీ నంబర్ 17. పొరపాటున 18గా ముద్రితమైన జెర్సీని ధరించాడా? అనే సందేహం అభిమానుల్లో నెలకొంది. లేకపోతే కావాలనే ఆ నంబర్ జెర్సీని వేసుకొని వచ్చాడా? అనేది చర్చనీయాంశంగా మారింది. అయితే, ఇంతకుముందు ముకేశ్ కుమార్ (జెర్సీ నంబర్ 49) కూడా గత ఇంగ్లాండ్ పర్యటనకు ముందు ఏ' జట్టు తరపున బరిలోకి దిగినప్పుడు 18వ నంబర్ జెర్సీని ధరించాడు.

ఫ్యాన్స్ విజ్ఞప్తి మరోలా..

స్టార్ ఆటగాళ్లు ఆటకు వీడ్కోలు పలికినప్పుడు ఆ జెర్సీ నంబర్లకు కూడా రిటైర్మెంట్ ఇచ్చేయడం ఆనవాయితీగా వస్తోంది. సచిన్ తెందూల్కర్ (10), ఎంఎస్ ధోనీ (7) ఆటకు గుడ్బై చెప్పినప్పుడు బీసీసీఐ ఇలానే చేసింది. ఆ నంబర్ల జెర్సీలను ఎవరూ వాడేందుకు వీలు లేకుండా చేసింది. కానీ, కోహ్లి విషయంలో మాత్రం బీసీసీఐ ఇంకా అలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే, విరాట్ ఇప్పుడు వన్డేల్లోనూ ఉండటంతో 18వ నంబర్కు రిటైర్మెంట్ ఇవ్వలేదు. దీంతో టెస్టుల్లో అందుబాటులో ఉన్న ఈ నంబర్ను రిషబ్ పంత్ ఈ అనధికారిక టెస్టు సిరీస్ కోసం ఎంచుకొని ఉంటాడని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవేళ కోహ్లి, రోహిత్ (జెర్సీ నంబర్ 45) వన్డే ఫార్మాట్నూ వదిలేస్తే మాత్రం బీసీసీఐ ఆ దిశగా ఆలోచన చేసే అవకాశం లేకపోలేదు. తొలి అనధికారిక టెస్టులో టాస్ ఓడిన దక్షిణాఫ్రికా ఏ జట్టు బ్యాటింగ్కు దిగింది. భారత ఏ బౌలర్లను ఎదుర్కొంటూ మెరుగైన ప్రదర్శనే చేస్తోంది. ఆ జట్టు ఓపెనర్ లెసెగో (0) డకౌట్ అయినప్పటికీ.. మరో ఓపెనర్ జోర్డాన్, వనౌన్ బ్యాటర్ హజ్జా హాఫ్ సెంచరీలు

ఇంటి చిట్కాలు

దోశ ఇడ్లీ పిండి మిక్సీ పట్టేటప్పుడు ఒక స్పూన్ టీనీ కలిపితే పిండి చక్కగా పులుస్తుంది

ఈ కాలంలో పిండి సరిగా పులవదు. అలా కాకుండా ఈ చలికాలంలోనూ పిండి సరిగ్గా పులవాలంటే ఎలాంటి టిప్స్ ఫాలో అవ్వాలో తెలుసుకోండి. చలికాలంలో ప్రతి ఒక్క విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. అలానే ఫుడ్ విషయంలో కూడా. ముఖ్యంగా బ్రేక్‌ఫాస్ట్ చేసినప్పుడు మనం ఎక్కువగా మనం ఇడ్లీ, దోశ చేస్తాం. అలా చేసినప్పుడు ముందుగా పిండిని నానబెడతాం. అయితే, ఈ పిండి ఎంత బాగా పులిస్తే అంత బాగా వస్తాయి టిఫిన్స్. కానీ, చలికాలంలో పిండి ఎక్కువగా పులవదు. ఆ పిండితో దోశ కానీ ఇడ్లీ కానీ చేస్తే గట్టిగా రాళ్ళలా వస్తాయి. అలాకాకుండా ఎలా పిండిని మిక్సీ పట్టాలి. ఎలా స్టోర్ చేయాలో తెలిస్తే పిండి చక్కగా పులుస్తుంది. మీరు ప్రతీ సీజన్‌లా బ్రేక్‌ఫాస్ట్‌ని ఎంజాయ్ చేయొచ్చు. అందుకోసం ఏం చేయాలో తెలుసుకోండి.

మరమరాలు, మెంతులు..

పిండిని నానబెట్టేటప్పుడు టీ స్పూన్ మెంతులు కూడా వేసి నానబెట్టండి. దీంతో దోశలకి మంచి రంగు వస్తుంది. పిండి కూడా బాగా పులుస్తుంది. దీంతో పాటు మరమరాలు కలపండి. అవి కూడా దూదిలా ఉండే మరమరాలు కలిపితే పిండి చక్కగా పులుస్తుంది. అదే విధంగా దోశలు, ఇడ్లీలు చక్కగా వస్తాయి.

వేడినీటితో మిక్సీ పట్టడం..

మిక్సీ పట్టేటప్పుడు చాలా మంది నీటిని కలుపుతుంటారు. అయితే, చలికాలంలో వేడి నీరు మరీ ఎక్కువ వద్దు.. కొద్దిగా గోరువెచ్చని నీటిని పోసి మిక్సీ పట్టండి. దీని వల్ల త్వరగా పులుస్తుంది. అయితే, మరీ ఎక్కువ నీరు పోస్తే మిక్సీ జార్స్ పాడయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి, తక్కువగా అంటే గోరువెచ్చని నీరు మాత్రమే వాడండి.

వేడిగా ఉన్న ప్రాంతంలో..

అదే విధంగా పిండిని వేడి ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో పెట్టండి. స్టా దగ్గర పెట్టడం మంచి పని. అదే విధంగా, ఎక్కువ టైమ్ పులియడానికి చూడండి. దీని వల్ల కూడా పిండి చక్కగా పులుస్తుంది. అదే విధంగా, పిండిని ఉంచే గిన్నెలు కూడా కరెక్ట్‌గా ఉండేలా చూడండి. ఎలాంటి గ్యాప్ ఉండొద్దు.

సరైన భాగాల్లో..

పిండి నానబెట్టేటప్పుడు మనం ఇడ్లీ రవ్వ, మినపప్పు, దోశకి బియ్యం ఇవన్నీ కూడా ఎంతమోతాదులో తీసుకోవాలో తెలిసి ఉండాలి. అప్పుడే ఇడ్లీ, దోశ పెర్ఫెక్ట్‌గా వస్తాయి. పిండి కూడా ఎక్కువగా పులుస్తుంది. కొంతమంది దోశల పిండికి బియ్యం ఎక్కువగా, మినపప్పు వేస్తారు. అదే విధంగా, ఇడ్లీకోసం మినపప్పు ఎక్కువగా రవ్వ తక్కువగా కలుపుతారు. అలా కాకుండా సరైన మోతాదులోనే తీసుకోండి.



స్టీమింగ్..

మరీ ఎక్కువగా చల్లగా ఉన్నప్పుడు ఈ టెక్నిక్ బాగా ఉపయోగపడుతుంది. అదేంటంటే.. మిక్సీ పట్టిన పిండిని గిన్నెలో వేసి మరిగిన నీరు ఉన్న మరో గిన్నెలో పెట్టి దీనిని కప్‌బోర్డ్‌లో ఉంచి రాత్రంతా అలానే ఉంచండి. దీని వల్ల పిండి చక్కగా పులుస్తుంది. అదే విధంగా మైక్రోవేవ్‌లో కాసేపు ఉంచినా పిండి చక్కగా పులుస్తుంది.

బేకింగ్ సోడా..

అదే విధంగా, కొద్దిగా మనం బేకింగ్ సోడా కలపొచ్చు. దీని వల్ల కూడా పిండి చక్కగా పులుస్తుంది. అయితే, ఇది ఆప్షనల్ మాత్రమే. ఎక్కువగా బేకింగ్ సోడా వద్దు. దీని వల్ల సమస్యలొచ్చే అవకాశం ఉంది.